

టీసీలను ప్రధానోపాధ్యాయుడికి అందజేస్తున్న ఉపాధ్యాయులు, వారి పిల్లలు

## సర్కారు బడికి ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు

భీమ్‌గల్, జూలై 11: మండలంలోని బెజ్జోరా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు వారి పిల్లలను గురువారం అదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఉపాధ్యాయులు మేస రాజ్‌కుమార్ తన కూతురు నక్షత్రను 10వ తరగతిలో, ఎస్‌డీ అజీమ్ తన కుమారుడు సయ్యద్ ఇహాన్‌ను 9వ తరగతిలో, కె.మారుతి తన కుమారుడు హరితేజను 8వ తరగతిలో చేర్పించారు. వారి పిల్లల టీసీలను ప్రధానోపాధ్యాయుడు ఎండీ హఫీజుద్దీన్‌కు అందజేశారు. భీమ్‌గల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పి.రాజేందర్ తన కూతురు హిమానిని 6వ తరగతిలో బెజ్జోరాలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు మంచి విశ్వాసం కలిగేందుకు తమ పిల్లలను చేర్పించామని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# చిరుత కలకలం

- భయాందోళనలో కోటగిరి మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు
- ఇప్పటికే పలు మేకలు, కుక్కలు మృత్యువాత
- చిరుతపై అటవీశాఖ అధికారులు నిఘాపెట్టాలని ప్రజల విన్నపం

కోటగిరి, జూలై 11 : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని పలు గ్రామాల ప్రజలు చిరుత సంచారంతో భయాందోళన చెందుతున్నారు. కొత్తపల్లి, దేవునిగుట్ట తండా, నాగేంద్రపూర్, బస్వాపూర్, అడ్కాస్‌పల్లి గ్రామాల శివారులో పెద్ద ఎత్తున అటవీ ప్రాంతం ఉన్నంది. రెండేండ్ల నుంచి చిరుత అప్పుడప్పుడు కనిపిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. గత నెల 28న తెల్లవారుజామున 3:30 గంటలకు కోటగిరి మండలం నాగేంద్రపూర్ గ్రామంలో సుధీర్ అనే రైతు ఇంటి ఆవరణలోకి చిరుత ప్రవేశించి, కుక్కపై దాడిచేసిన ఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు మళ్లీ ఉలిక్కిపడ్డారు.

కోటగిరి మండలం దేవునిగుట్ట తండా పంచాయతీ పరిధిలోని నాగేంద్రపూర్ గ్రామంలో ఓ చిరుత గత నెల 28న ఉదయం 3:30 గంటలకు చిరుతపులి కొత్తపల్లి సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ సుధీర్ ఇంటి ప్రహరీ దూకింది. ఇంటి ఆవరణలో ఉన్న కుక్కపై దాడి చేసింది. కుక్క అరుపులు విన్న సుధీర్.. చిరుతను చూసి అరవడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా.. బీట్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రలను గుర్తించి చిరుతగా నిర్ధారించారు. చిరుతకు సుమారు ఏడాది వయస్సు ఉంటుందని గుర్తించారు. గతేడాది సైతం కొత్తపల్లి గ్రామ సమీపంలో మేకల మందపై చిరుత దాడి చేసి చంపింది. ఇలా మేకలపై రెండు, మూడు సార్లు దాడులు జరిగాయి. ఆయా గ్రామాల్లో తరచూ చిరుత కలకలం సృష్టించడంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు భయంతో జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చిరుతపై నిఘా పెట్టాలని, చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.



కోటగిరి మండలం నాగేంద్రపూర్ శివారులో ఉన్న అటవీప్రాంతం, ఇన్‌సెట్‌లో చిరుత పాదముద్రలు

### ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..



నాగేంద్రపూర్, కొత్తపల్లి అటవీ ప్రాంతాల్లో చిరుత ఉన్నట్లు గుర్తించాం. నాగేంద్రపూర్‌లో సుధీర్ ఇంటి ప్రహరీ దూకి కుక్కపై దాడి చేయడం.. పాదముద్రల సేకరణ ద్వారా చిరుతగా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం నిజాంసాగర్ కాలువ నీటి ప్రవాహం ఉండడంతో చిరుత ఇటువైపు వచ్చింది. మరోసారి వస్తే చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేస్తాం. గ్రామస్తులు కూడా అప్రమత్తంగా ఉండాలి.

*- అరుణ్‌కుమార్, బీట్ ఆఫీసర్, అక్బర్‌నగర్*

## రైల్వే సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

**హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్**



రైల్వే స్టేషన్‌లో పోలీసులతో మాట్లాడుతున్న హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్

వినాయక్‌నగర్, జూలై 11: భారత రైల్వే సంస్థలో పనిచేస్తున్న రైల్వే రన్నింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ తెలిపారు. గురువారం ఆయన నిజామాబాద్ జిల్లా రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫాంతో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. రైల్వే అధికారులతో మాట్లాడి ప్రయాణికుల అవసరాలు, ఇతర సదుపాయాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకో పైలట్లు రైల్వే కుటుంబంలో ముఖ్యమైన సభ్యులని, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రైల్వే సిబ్బంది తమ డ్యూటీ సమయం ముగిసిన అనంతరం మళ్లీ విధుల్లో చేరేంతవరకు విశ్రాంతి కోసం అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. పైలట్, కో పైలట్, ట్రైన్ మేనేజర్లతోపాటు ఇతర సిబ్బంది రన్నింగ్ రూమ్‌లో విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ డివిజన్ మెకానికల్ ఇంజినీర్ జీషాన్ హైమద్, సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ అనిరుధ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ సీపీ సంతకాన్ని ఫోర్జరీ చేసి
## ఫేక్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చిన నిందితుల అరెస్టు

నవీపేట, జూలై 11: రిటైర్డ్ సీపీ సంతకాన్ని ఫోర్జరీ చేసి గల్ఫ్ బాధితుడికి ఫేక్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇప్పించిన దినకర్, ధరిసింగ్ అనే ఇద్దరు నిందితులను సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నార్త్ రూరల్ సీఐ సతీశ్ పర్యవేక్షణలో గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట మండలం పొతంగల్ గ్రామానికి చెందిన అనిల్‌కు గల్ఫ్ వెళ్లేందుకు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ అవసరమైంది. దీంతో ఓ కన్సల్టెన్సీ నడుపుతున్న ఆర్మూర్‌కు చెందిన దినకర్, నిజామాబాద్ చెందిన ధరిసింగ్‌ను సంప్రదించాడు. అనిల్ అవసరాన్ని ఆసరగా తీసుకున్న సదరు నిందితులు గతంలో నిజామాబాద్ సీపీగా పని చేసిన మాజీ సీపీ నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలను సృష్టించి ఫేక్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను అందజేసి సదరు బాధితుడి వద్ద సొమ్మును కాజేశారు. పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టేందుకు పోలీసు కానిస్టేబుల్ ఇటీవల అనిల్ ఇంటికి వెళ్లారు. పోలీసులను చూసిన బాధితుడు తనకు ఇప్పటికే క్లియరెన్స్ సర్టిఫికెట్ వచ్చిందని చెప్పి దానిని పోలీసులకు చూపాడు. దానిని పరిశీలించిన పోలీసులు ఫేక్ అని నిర్ధారించారు. సీపీ ఆదేశాల మేరకు సీబీఐ హెడ్ కానిస్టేబల్ విచారణ చేపట్టి ఫేక్ సర్టిఫికెట్ అందజేసిన నిందితులపై బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న దినకర్, ధరిసింగ్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



## బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ డీసీసీ చీఫ్ మానాల మోహన్ రెడ్డి తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి అభినందించారు.

*-కంఠేశ్వర్, జూలై 11*

## దూరప్రాంతాలు వెళ్లేవారికి 10శాతం రాయితీ

ఖలీల్‌వాడి, జూలై11: టీజీఎస్ ఆర్టీసీ బస్సులో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఉత్తరప్రదేశ్‌కు అప్ అండ్ డౌన్ ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్ చార్జిపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రాంతీయ అధికారి జానీరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నెలవారి సీజన్ టికెట్ తీసుకుని 20 రోజుల బస్సు చార్జీతో 30 రోజులు, ఎక్స్‌ప్రెస్ నెలవారి సీజన్ టికెట్ తీసుకున్నవారు రూ.20 అదనంగా చెల్లిస్తే అదే రూట్‌లోని డీలక్స్ బస్సులో కూడా ప్రయాణించవచ్చని వివరించారు.

## పాముకాటుతో రైతు మృతి

నిజాంసాగర్, జూలై 11: పాముకాటుతో రైతు మృతిచెందిన ఘటన మహ్మద్‌నగర్ మండలంలోని గిర్నితండాలో చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన కడావత్ శంకర్(47) గురువారం మధ్యాహ్నం పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. కొద్ది సేపటి అనంతరం అతడు స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తోటి రైతులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య స్వరూప, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



### రాజ్‌నాథ్‌కు అస్వస్థత

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అస్వస్థతకు గురయ్యారు. అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను గురువారం ఉదయం ఎయిమ్స్‌లోని న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించారు. ఎయిమ్స్ మీడియా సెల్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ రీమా దాదా తెలిపిన వివరాల ప్రకారం, రాజ్‌నాథ్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆయనను వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. నడుము నొప్పి రావడంతో ఆయనను ఎయిమ్స్‌లో చేర్పించారు.

### కేజ్రీవాల్ పిటిషన్‌పై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు చెప్పబోతున్నది. ఢిల్లీ మద్యం విధానం కేసులో తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని ఆయన సవాల్ చేశారు. ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. ఈ పిటిషన్‌పై వాదనలు ముగిసిన తర్వాత తీర్పును సుప్రీంకోర్టు మే 17న రిజర్వు చేసింది.

### చైనా నుంచి పాక్‌కు నిషేధిత రసాయనాలు!

- తమిళనాడులో సీజ్ చేసిన కస్టమ్స్ అధికారులు

చెన్నై, జూలై 11: నిషేధిత రసాయనాలు ఉన్న చైనా కార్గో కంటైనర్‌ను తమిళనాడులోని కట్టుపల్లి ఓడరేవు వద్ద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ జీవ, రసాయన యుద్ధం కోసం ఈ రసాయనాలను చైనా పంపుతున్నట్టు కస్టమ్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. టియర్‌గ్యాస్‌గా వాడే (ఆర్థో క్లోరో బెంజైలిడిన్ మాలోనోనిట్రైల్) కెమికల్ చైనా కంటైనర్‌లో పెద్ద మొత్తంలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అల్లర్లు, నిరసనల్ని నియంత్రించటానికి, సైనికపరంగానూ వాడొచ్చునని వారు తెలిపారు. రావల్పిండిలోని రక్షణ ఉత్పత్తులను సరఫరా చేసే సంస్థకు రసాయనాలను పంపుతున్నట్టు అధికారులు గుర్తించారు.

# మళ్లీ రైతుల పోరుబాట

- దేశవ్యాప్త నిరసనలకు సమాయత్తం
- ఎంఎస్పీకి చట్టబద్ధత, రుణమాఫీ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన



న్యూఢిల్లీ, జూలై 11: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) గురువారం ప్రకటించింది. 2020-21లో కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టిన రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఎస్కేఎం గురువారం ప్రకటించింది. మళ్లీ ఉద్యమాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ముఖ్యంగా పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్టు తెలిపింది. 2021 డిసెంబర్ 9న రైతు సంఘాలతో జరిగిన చర్చల్లో కేంద్రం చేసుకున్న ఒప్పందంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. జూలై 16 నుంచి 18 వరకు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత సహా ఎంపీలందరినీ కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించనున్నట్టు తెలిపింది. ఉద్యమం సమయంలో మరణించిన అన్నదాతల గౌరవార్థం ఢిల్లీ సరిహద్దుల్లోని టిక్రి, సింఘు వద్ద స్మారకాలను నిర్మించనున్నట్టు వెల్లడించింది. అలాగే 2021లో ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖీరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా కాన్వాయ్ దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

**ఈసారి దేశవ్యాప్త ఉద్యమం**

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నుంచి భారత్ బయటకు రావాలని, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలను అనుమతించవద్దని ఎస్కేఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 9న 'క్విట్ ఇండియా డే'ను 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'గా నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ప్రదర్శనలు నిర్వహిస్తామని ప్రకటించారు. తమ డిమాండ్ల సాధనకు ఇక కొత్త పద్ధతుల్లో ఉద్యమాన్ని నడిపించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టడం కాకుండా దేశవ్యాప్త నిరసనలు తెలుపుతామని, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, హర్యానా రాష్ట్రాలపై ప్రధాన దృష్టి సారిస్తామని ఎస్కేఎం నేతలు ప్రకటించారు.



### తెరుచుకోనున్న రత్న భాండాగారం
## అధికారులకు పాముల భయం

పూరీ: ఒడిశాలోని పూరీలో ఉన్న శ్రీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారాన్ని ఈ నెల 14న తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రహస్య గదిలోని ఐదు పెట్టెల్లో ఉన్న అమూల్యమైన ఆభరణాలను లెక్కించబోతున్నారు. ఆ సమయంలో అనుసరించవలసిన మార్గదర్శకాలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అయితే పురాతన దేవాలయాల్లోని ఖజానాలకు పాములు కాపలా ఉంటాయనే విశ్వాసం ఉండటంతో అధికారులు భయాందోళనలతో గడుపుతున్నారు. పాములు పట్టడంలో నిపుణులను, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 1978 తర్వాత రత్న భాండాగారాన్ని తెరవబోతుండటం ఇదే మొదటిసారి.

## నీట్‌పై విచారణ జూలై 18కి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 11: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై విచారణను జూలై 18కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలపై విచారణ జరిపించాలని, పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారిస్తున్నది. ఈ పిటిషన్లపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, పరీక్ష నిర్వహించిన జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ)ను ఇంతకుముందు కోర్టు ఆదేశించింది. బుధవారం కేంద్రం, ఎన్టీఏ వేర్వేరుగా స్పందనను తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేశాయి. గురువారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ ప్రారంభించింది. పరీక్షలో అక్రమాలపై సీబీఐ జరుపుతున్న విచారణ పురోగతిపై తమకు నివేదిక అందినట్టు కోర్టు పేర్కొన్నది. అయితే, తమకు కేంద్రం, ఎన్టీఏ దాఖలు చేసిన అఫిడవిట్లు అందలేదని పలువురు పిటిషన్‌దారులు ధర్మాసనానికి తెలిపారు. దీంతో జూలై 15కు విచారణ వాయిదా వేస్తామని ధర్మాసనం చెప్పింది. అయితే, ఆ రోజు తాను అందుబాటులో ఉండనని కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీంతో విచారణను జూలై 18కి కోర్టు వాయిదా వేసింది.



**పేపర్ లీక్ సూత్రధారి రాకీ అరెస్టు**

నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని సీబీఐ అరెస్టు చేసింది. పేపర్ లీక్ వెనుక మాస్టర్‌మైండ్‌గా అనుమానిస్తున్న రాకేశ్ రంజన్ అలియాస్ రాకీని అరెస్టు చేశామని సీబీఐ అధికారులు గురువారం వెల్లడించారు. కోర్టు అతడికి 10 రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగించినట్టు అధికారులు తెలిపారు. సీబీఐ అధికారులు పట్నా, కోల్‌కతా సమీపంలో పలు చోట్ల దాడులు నిర్వహించగా, రాకేశ్ రంజన్ పట్టుబడ్డాడని తెలిసింది.

కాగా, నీట్‌లో సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదని, కాబట్టి మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## సూసైడ్ క్యాప్సూల్‌పై స్విట్జర్లాండ్ నిషేధం



బెర్న్, జూలై 11: క్షణాల్లో ప్రాణాలు తీసేసే సూసైడ్ క్యాప్సూల్‌ను స్విట్జర్లాండ్ నిషేధించింది. ఎగ్జిట్ స్విట్జర్లాండ్ అనే కంపెనీ సార్కోఫాగస్ పేరుతో ఈ మెషీన్‌ను తయారుచేసింది. కారుణ్య మరణం పొందాలనుకునే వారి కోసం దీనిని తయారుచేశారు. ఈ మెషీన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని దీనిని తయారుచేసిన డాక్టర్ ఫిలిప్ నిట్స్‌ఖే జూన్ 10న ప్రకటించారు. అయితే, ఈ సూసైడ్ క్యాప్సూల్ వల్ల దుష్పరిణామాలు ఉంటాయని భావించిన స్విట్జర్లాండ్ ప్రభుత్వం దీనిపై నిషేధం విధించింది. ఏదైనా భరించలేనంత అనారోగ్య సమస్యను అనుభవిస్తున్న వారు సులువుగా కారుణ్య మరణం పొందేందుకు ఈ క్యాప్సూల్ ఉపయోగపడుతుందని దీనిని తయారుచేసిన కంపెనీ చెప్తున్నది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు ఈ క్యాప్సూల్‌లో కూర్చోగానే మెషీన్.. ఎవరు నువ్వు?, ఎక్కడ ఉన్నావు?, ఈ బటన్ నొక్కితే ఏమవుతుందో తెలుసా? అనే మూడు ప్రశ్నలు అడుగుతుందని డాక్టర్ ఫిలిప్ చెప్తున్నారు. ఈ ప్రశ్నలకు వారు సమాధానాలు చెబితే మెషీన్ ప్రారంభమవుతుందని, అప్పుడు బటన్ నొక్కవచ్చని తెలిపారు. బటన్ నొక్కిన 30 సెకన్లలో ఇందులో ఆక్సిజన్ శాతం 21 నుంచి 1 శాతానికి పడిపోయి క్షణాల్లో మనిషి మరణిస్తాడని చెప్పారు. అయితే, ఈ క్యాప్సూల్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో నిషేధిస్తూ స్విట్జర్లాండ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం

బీజింగ్, జూలై 11: చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం..సంచలనం రేపుతున్నది. ఇంధనాన్ని (బొగ్గు ఆయిల్) స్టోరేజ్ చేసే ట్యాంకర్లలో వంట నూనెలను నింపి..సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఆహార భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో చైనా ప్రభుత్వ రంగ కంపెనీలు తయారుచేసిన వంట నూనెల అమ్మకాలను ఆన్‌లైన్ స్టోర్లు నిలిపివేస్తున్నాయి. ఆ కంపెనీల ఉత్పత్తులను తొలగిస్తున్నాయి. ట్యాంకర్లలో కోల్ ఆయిల్‌ను అన్‌లోడింగ్ చేసిన వెంటనే, స్టోరేజ్ ట్యాంకర్లను శుభ్రం చేయకుండా.. సోయాబీన్ ఆయిల్‌ను నింపారని 'బీజింగ్ న్యూస్' గతవారం వెలువరించిన వార్తా కథనం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో వంట నూనెల సరఫరాపై చైనా అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.



### ఆడతోడు కోసం 1.3 కిలోమీటర్లు ఈదిన మగసింహాలు

న్యూఢిల్లీ: ఆడతోడు కోసం అలమటించిపోయిన రెండు సోదర సింహాలు ఓ నదిని 1.3 కిలోమీటర్లు ఈది అవతలి ఒడ్డుకు చేరుకున్నాయి. ఉగాండాలోని క్వీన్ ఎలిజబెత్ నేషనల్ పార్క్‌లో జరిగిందీ ఘటన. ఆ నది మొత్తం మొసళ్లు, నీటి ఏనుగులతో నిండి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా ఈదాయి. రెండు సింహాలలో ఒకటైన జాకబ్ క్వీన్ ఎలిజబెత్ పార్కులో పదేండ్లుగా నివసిస్తున్నది. ఇది వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని కాలు కోల్పోయింది. అయినప్పటికీ సోదర సింహంతో కలిసి రెండు సరస్సులను కలిపే జలమార్గాన్ని విజయవంతంగా దాటింది. పార్కులో ఆడసింహాల కోసం విపరీతమైన పోటీ ఉంది. ఈక్రమంలో ఓ ఆడతోడు కోసం మరో మగ సింహాల గుంపుతో పోరాడి ఓడిపోయాయి. ఆ తర్వాత ఇవి రెండూ నదికి ఆవలివైపున ఉన్న ఆడ సింహాల కోసం ప్రమాదకరమైన ప్రయాణం చేసి ఉండొచ్చని ఆస్ట్రేలియాకు చెందిన అధ్యయనకర్త అలెక్స్ బ్రాజ్‌కోవ్‌స్కీ తెలిపారు.

## సౌదీ విమానం ల్యాండింగ్ గేర్‌లో మంటలు

*విమానం దిగుతుండగా ఘటన • పాక్‌లో తప్పిన పెను ప్రమాదం*



ఇస్లామాబాద్, జూలై 11: పాకిస్థాన్‌లోని పెషావర్ విమానాశ్రయంలో సౌదీ ఎయిర్‌లైన్స్ విమానానికి భారీ ప్రమాదం తప్పింది. 276 మంది ప్రయాణికులు, 21 మంది సిబ్బందితో రియాద్ నుంచి వస్తున్న ఈ విమానం దిగే సమయంలో ల్యాండింగ్ గేర్‌లో మంటలు చెలరేగాయి. విపత్తు నివారణ సిబ్బంది అప్రమత్తతతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఈ విమానం పెషావర్ బచ్చా ఖాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగే సమయంలో ఎడమ వైపు ల్యాండింగ్ గేర్ నుంచి పొగ, నిప్పురవ్వలు రావడాన్ని గమనించిన ట్రాఫిక్ కంట్రోలర్లు పైలట్‌ను హెచ్చరించారు. తర్వాత ఎయిర్‌పోర్టులోని అగ్నిమాపక, ఇతర విపత్తు నివారణ విభాగాలను కూడా అప్రమత్తం చేశారు. పౌర విమానయాన విభాగం (సీఏఏ) సిబ్బంది వెంటనే విమానం వద్దకు చేరుకుని మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక నిరోధకాలను ప్రయోగించారు. దీంతో మంటలు ఆగిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. తర్వాత ప్రయాణికులు, సిబ్బందిని జారుడు స్లయిడ్ ద్వారా విమానంలోంచి దింపారు.

## ఢీకొనబోయిన రెండు విమానాలు

న్యూయార్క్, జూలై 11: అమెరికాలోని న్యూయార్క్‌లో ఆకాశంలో రెండు విమానాలు ఢీకొనబోయాయి. న్యూయార్క్‌లోని సిరక్యూస్‌లో పోలీస్ శాఖకు చెందిన పెట్రోలింగ్ వాహనంలోని డాష్ కెమెరా ఈ దృశ్యాన్ని బంధించింది. ఈ నెల 8న ఈ రెండు ప్రయాణికుల విమానాలు ఇంచుమించు ఒకదానికొకటి ఢీకొనేంత దగ్గరగా వచ్చినా వెంట్రుకవాసిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. సిరక్యూస్ హన్‌కాక్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఒకే రన్‌వేపైకి ఏకకాలంలో ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుమతి ఇస్తూ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది చేసిన తప్పిదం కారణంగానే ఇది సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

## బిడ్డను కంటే 92 వేలు

- రష్యాలోని కరేలియా అధికారుల ఆఫర్

మాస్కో, జూలై 11: తమ దేశంలో సంతానోత్పత్తిని పెంచడానికి రష్యా పలు చర్యలు చేపడుతున్నది. అందులో భాగంగా దేశ వాయువ్య ప్రాంతంలోని రిపబ్లిక్ ఆఫ్ కరేలియా అధికారులు ఒక వినూత్న ఆఫర్‌ను ప్రకటించారు. స్థానిక యూనివర్సిటీ, కాలేజీలలో చదివే 25 ఏండ్ల లోపు యువతులు ఆరోగ్యవంతమైన బిడ్డను కనుక ప్రసవిస్తే వారికి రూ.92 వేలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. దేశంలో సంతానోత్పత్తి రేటును పెంచడానికి ప్రవేశపెట్టే ఈ పథకం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే రష్యా, దాని రీజియన్ ప్రాంతాలు జననాల రేటును పెంచడానికి పలు చర్యలు చేపట్టాయి. ఇటీవల ఉక్రెయిన్‌తో యుద్ధంతో రష్యాలోని పలువురు యువకులు మరణించగా, బలవంతంగా సైన్యంలోకి తీసుకుంటారన్న భయంతో చాలామంది దేశాన్ని వదిలి పారిపోయారు. మాస్కోటైమ్స్ కథనం ప్రకారం ఇప్పటికే దేశంలో గర్భనిరోధక సాధనాలైన కండోమ్‌లు, మాత్రలు తదితర వాటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. కాగా, ప్రతి రష్యా మహిళ 8 మందికి జన్మనివ్వాలని గత ఏడాది డిసెంబర్‌లో పుతిన్ విజ్ఞప్తి చేశారు.